విశాలాంధ్ర గుంటూరు జిల్లా

విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవకుమార్ సల్లూరికు తమ యూనివర్సిటీ సీఎస్‌ఈ విభాగంలో సోమవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగ భూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నోవెల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ సివియారిటీ ప్రెడిక్షన్ ఆఫ్ దయాబెటిక్ రెటినోపతీ' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ కేవీ క్రిష్ణ కిషోర్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. దేవకుమార్ సల్లూరిను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

నీరివ్వకపోతే రహదారులు నిర్బంధిస్తాం

విశాలాంధ్ర-పొన్నూరు : పంటలకు సాగునీరు అందించకపోతే రహదారులు దిగ్బంధిస్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం పొన్నూరు పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి పారుదల శాఖ మంత్రి అంబటి నోరు అదుపులో పెట్టుకోవాలని నిజాన్ని మాట్లాడే ప్రతిపక్షం గొంతు నొక్కడం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో సాగునీరు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, మాదాల వెంకటేశ్వరరావు, పటాన్ అహ్మద్ ఖాన్, బాజీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేస్తాం.. సమయం ఇవ్వండి

విశాలాంధ్ర-పొన్నూరు : మాచవరం గ్రామ పరిధిలోని రైల్వే పట్టాల పక్కన చెరువు పోరంబోకులో దశాబ్దాలుగా నివాసముంటున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలను రైల్వే శాఖ అధికారులు ఖాళీ చేయమని బలవంతం చేస్తున్నారని కాలనీవాసులు మీడియాకు తెలిపారు. సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసి అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉన్న పళంగా ఖాళీ చేయమంటే కుటుంబంతో సహా ఎక్కడికి వెళ్లాలని సమయం ఇవ్వాలని కోరారు.

నేడు ములుకుదురులో ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలోని ములుకుదురు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ స్పెషాలిటీ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పొన్నూరు మండలంలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు ముగిస్తాయని పేర్కొన్నారు.

స్పందన సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పొన్నూరు : తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం యధావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలు క్షేత్రస్థాయిలో సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసిందని తహశీల్థార్ తెలిపారు.

కేఎల్‌యూకు 5జీ యూజ్ కేస్ ల్యాబ్‌ను కేటాయించిన కేంద్రం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2023(ఐఎం) డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జీ యూజ్ కేస్ ల్యాబ్‌ను కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి కేటాయిస్తూ కీలకమైన ఉత్తర్వులు జారీచేసిందని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీకి 5జీ యూజ్ కేస్ ల్యాబ్‌ను అందించినందుకు ప్రధాని మోదీకి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత విద్యాసంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో తాము విద్యార్థులకు సాంకేతికతతో పరిశోధనలు నిర్వహించేలా దిశానిర్దేశం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, టెలికమ్యూనికేషన్స్ విభాగం దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దురాక్రమణను నిలిపివేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : పలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ వెంటనే నిలిపివేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం తాడేపల్లి మహానాడు 13వ రోడ్డులో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాగత యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కొండారెడ్డి, ఎన్.పోతురాజు, భక్తుల రమణయ్య, భక్తుల వెంకటేశ్వర్లు, కేతుబోయిన హనుమయ్య, భక్తుల చిన్న గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద ఘటన దురదృష్టకరం

విశాలాంధ్ర-గుంటూరు : విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ఘటన దురదృష్టకర సంఘటన అని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం, రైల్వే శాఖ తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రమాద ఘటనపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

ఘనంగా అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-గుంటూరు : హజ్రత్ సయ్యద్ మహబూబ్ సుభాని గౌసే సమ్‌దని కుతుబే రబ్బాని వారి గ్యారమి షరీఫ్ పండుగను హజ్రత్ సయ్యద్ షా మొహిద్దీన్ బాద్‌షా దర్గా ఆవరణలో హజ్రత్ సయ్యద్ షాహ మొహిద్దీన్ బాద్‌షా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన పెంచుకొని బాధ్యతగా వ్యవహరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అవినీతి రహిత సమాజం కోసం చట్టంపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సెమినార్‌లో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అడిషనల్ ఎస్పీ సుప్రజా, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కే ఈశ్వరరావు, గుంటూరు అడిషనల్ ఎస్పీ ఎం.మహేంద్ర, డీఆర్‌ఓ చంద్ర శేఖర రావు, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కే.స్వాతి, డిప్యూటీ ట్రాన్స్ఫోర్ట్ కమిషనర్ కరీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తాము నిర్వహించాల్సిన పనులను చేయకపోవడం కూడా అవినీతి క్రిందకే పరిగణించాల్సి వుంటుందన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యవసాయాన్ని చేస్తున్న రైతులు కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ క్రిమి సంహారక మందులతో నష్టపోతున్నారన్నారు. వీటి నివారణకు అవసరమైన విజిలెన్స్, ప్రభుత్వ సిబ్బంది ఉన్నప్పటికీ రైతులు నకిలీలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నిబద్దతతో పని చేసినపుడు నకిలీలను నివారించవచ్చని తెలి పారు. ప్రతి ఒక్క ఉద్యోగి తమ విధుల పట్ల అంకిత భావం, నిబద్ధత లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తే అవినీతిని నిర్మూలించవచ్చని తెలిపారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులలో కల్తీ జరుగుతున్నదని, కల్తీని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఈశ్వర రావు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు మరియు సంక్షేమ పథకాలలో అవినీతి అక్రమాలు మరియు పన్ను ఎగవేతలపై రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్, గుంటూరు యూనిట్ వారు చేపట్టిన తనిఖీలు, ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ జే.మోహన్ రావు, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డి.ఎం.అండ్ హెచ్‌ఓ డా.శ్రావణ బాబు, సిపిఓ శేషశ్రీ, డిఇఓ శైలజ, పంచాయితీ రాజ్ ఎస్.ఇ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఇ సురేష్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 194 అర్జీలు

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజ కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష అడిషనల్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మిలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 194 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీ ఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీ ఓపెన్ అయిన పిటీషన్లను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జె.మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రావణ బాబు, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, డీటీసీ కరీం, పంచాయితీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర, తెనాలి : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష అని, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెనాలి మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అన్నారు. స్థానిక పాండురంగపేట షాదీఖాన ఆవరణ యందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. జనరల్ ఓపి 29 మంది, ఆరోథపెడిక్ ఓపి 26 మంది, జనరల్ సర్జరీ ఓపి 16 మంది అప్తమాలజి ఓపి 27 మందిని పరీక్షించడం జరిగింది. కార్యక్రమంలో వైసిపి 19వ వార్డు ఇన్‌ఛార్జి చందూరు సాయి, మున్సిపల్ కమిషనర్ మేడికొండ జస్వంత్‌రావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల, వైద్యాధికారులు డాక్టర్ డి.కిషోర్ కుమార్, డాక్టర్ దేవికావాణి, డాక్టర్ షారోన్ రంజిత్, డాక్టర్ యదునందన్, ఏసిపి సుధాకర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగంశ్యామ్, యుయల్‌బి ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.రామ చంద్రరావు, హెల్త్ విజిటర్ పుష్పలత, విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పాలకులు విఫలం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య చికిత్స సేవలు అందుబాటులో లేక అత్యంత ఖరీదైన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి అప్పులు పాలవడం సర్వసాధారణమైందన్నారు. వందల కోట్లు ఖర్చుచేసి నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులలో అత్యధిక దేశాల ఆరోగ్య మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని సుదీర్ఘ చర్చలు జరిపి కొత్త తీర్మానాలు ఆమోదిస్తారని, అయితే అమలులోనే అలసత్వం చూపిస్తు తగినన్ని నిధులు సమకూర్చలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ లాంటి మహమ్మారి సంభవించినప్పుడు వైద్య చికిత్స, వసతులు ఎంత దారుణంగా ఉన్నాయో మన దేశంలో స్వయంగా అనుభవించామని, అప్పుడు దేశ వ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది ప్రాణాలు వదిలినట్లు వెల్లడైన అంచనాలే మన ఆరోగ్య స్థితి ఎలా ఉందో తెలిసిందని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు బాగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని శివరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-తాడేపల్లి : నిత్యం రైతులు, మహిళలు, చిన్నారులు తిరిగే ప్రాంతం. ఏ క్షణానైనా ప్రమాదం జరగవచ్చు. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోని వైనం. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన గౌర కోటయ్య ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం గత కొన్ని నెలలుగా ఒరిగి ఉంది. ఇటీవల అకాల వర్షాలు కురిసినప్పుడు విద్యుత్తు లైన్లు కూడా క్రిందకి వంగి వేలాడుతున్నాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తీసివేసి, మరొక స్తంభం వేయాలని పలువురు మహిళలు కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. జరగరాని నష్టం ఏదైనా జరిగితే, విద్యుత్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుంది. సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి, వంగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చి వేస్తే, ఆ ప్రాంతంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని పలువురు ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అధ్యక్షతన మంగళగిరి గ్రంథాలయ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చట్టబద్ధమైన అంశాలను ఉద్దేశించి చట్టబద్ధంగా అమలు చేయాలని నిర్ణయాలకు ఇస్తున్నామని, బడ్జెట్ పరిపాలన ఆమోదానికి మాత్రమే పరిమితం కాకుండా విధానపరమైన ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి సభ్యులు నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. గ్రంథాలయాలకు అదనపు బడ్జెట్‌ను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసన్నకుమార్, విజయనగరం జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ పద్మావతి, కడప జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ అమీరుద్దీన్, వై.నరసింహారావు, మహేష్ బాబు, డైరెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల మనుగడలో అర్చకులది కీలకపాత్ర

విశాలాంధ్ర-తాడేపల్లి : దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన ఆగమ సలహా మండలి సమావేశం సీతానగరంలోని రాష్ట్ర దేవాలయ పాలన సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగింది. అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చకుల విధివిధానాలు, సాంప్రదాయ ప్రక్రియలతో పాటూ ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అర్చక పరీక్షలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. దేవాలయాల మనుగడ విషయంలో అర్చకులది కీలకపాత్ర అని, వారి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తోందని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. దేవదాయ శాఖ పరిధిలో పెద్దసంఖ్యలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని, వీటికి మంచి నిష్ణాతులైన అర్చకులను సిద్ధం చేయాలని కమిషనరు సూచించారు. త్వరలో అర్చక పరీక్షలు నిర్వహించేందుకు ఆగమ సలహా మండలి సూచనలతో సిలబస్‌ను సిద్ధం చేయాలని సత్యనారాయణ ఆదేశించారు. ఇప్పటికే నాలుగు ఆగమాలకు సంబంధించిన సిలబస్ సిద్ధంగా ఉందని, మిగిలిన ఆగమాల సిలబస్‌ను కూడా సిద్ధం చేసి ఫిబ్రవరి మొదటి వారంలో అర్చక పరీక్షలు నిర్వహిస్తామని అర్చక ట్రైనింగ్ అకాడమి డైరెక్టర్ తనూజ్ విష్ణువర్ధన్ చెప్పారు. ఈ సమావేశంలో ఆగమ సలహా మండలి అధ్యక్షులు సత్యశ్రీనివాస అయ్యంగార్ అర్చక విధి విధానాలపై కీలక సూచనలు చేశారు. ఈయనతోపాటు ఇతర ఆగమ మండలి సభ్యులు కూడా పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాలయ పాలన సంస్థ డైరెక్టర్ ద్రోణంరాజు రామచంద్రరావు సమావేశానికి స్వాగతోపన్యాసం అందించారు.

గాజాలో శాంతి నెలకొల్పాలి

విశాలాంధ్ర, తెనాలి : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు నిర్వహించడం దుర్మార్గ చర్య అని దాడులను వెంటనే ఆపాలని మహిళా మండలి తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటలక్ష్మి, మేరీ క్యాథరీన్‌లు డిమాండ్ చేశారు. కొత్తపేటలో ఇందిరా ప్రియదర్శిని మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహిళలు తీర్మానం చేశారు. అమెరికా వత్తాసుతో గాజాపై ఇజ్రాయిల్ ఎడతెరిపి లేని బాంబుల వర్షం కురిపిస్తుందని వందలాది మంది చనిపోయారని, అందులో బాలలు మూడువంతులున్నారన్నారు. సామ్రాజ్యవాద అధిపత్యానికి ఇస్రాయిల్ ఒక తోలుబొమ్మగా వుందని అధ్యక్షురాలు వెంకటలక్ష్మి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందితో పాలస్తీనా ప్రదర్శనలు, నిరసనలు జరుగుతున్నాయని అదే రీతిలో తమ మహిళా మండలి సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. కార్యదర్శి క్యాథరీన్ మాట్లాడుతూ పలస్తీనాపై దాడులు వెంటనే ఆపాలని, తెనాలిలో అన్ని సంఘాలు పలస్తీనాకు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అతి పెద్ద ప్రజాస్వామ్యదేశానికి ప్రధాన మంత్రి మోడీ పలస్తీనాపై ద్వంద వైఖరి అవలంబించడం విచారకరమన్నారు. నాగరిక సమాజంలో మానవ హననం చేస్తూ దాడులు నిర్వహజంచడం సహించరానిదన్నారు. తెనాలిలో అన్ని మహిళా సంస్థలతో కలిపి పలస్తీనాకు సంఘీ భావంగా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కె.నగరాజకుమారి, తారాభాయ్, ముంతాజ్‌బేగం, అస్మితున్నిసా, మధుమతి, భానుమతి, మేరీ, లలితా చౌదరి, కామేశ్వరి, కనకమ్మ, కరుణ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా, చీకటి పాలనకు నిరసనగా కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమానికి అమరావతి జేఏసీ సోమవారం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గుడివాడకి చెందిన 9 మంది టీడీపీ మహిళలను ఇద్దరు టీడీపీ నాయకులను సీఐ శేషగిరిరావు, సిబ్బంది తాడేపల్లి వారధి వద్ద అదుపులోకి తీసుకొని దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

1న కాపు విద్యార్థి వసతి గృహ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 1న ఉదయం 10.30 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి కాపు విద్యార్థి వసతి గృహ ప్రారంభోత్సవం జరుగుతుందని తెలగ అభ్యుదయ సంఘం సెక్రటరీ బాలిశెట్టి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డు గోరంట్ల హసన్న మందిరం పక్క లైను విజయదుర్గ నగర్‌లో జరిగే ఈ కార్యక్రమంలో కాపు సోదరసోదరీమణులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని వసతి గృహాలకు ముఖ్యంగా బాలికల వసతి గృహానికి కృషి చేస్తామని తెలియజేశారు.

స్పందనకు 24 ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజల నుండి స్పందనలో అందే ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చేయాలని నగర కమిషనర్(ఇంచార్జి) పివికె భాస్కర్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన జరిగింది. ఇంచార్జి కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. స్పందనలో 24 ఫిర్యాదులు అందాయని ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఇంచార్జి కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ నివారణకు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలి: డిఎంహెచ్‌ఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ)డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు అన్నారు. నవంబర్ నెల ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశం మందిరంలో ఎస్‌హెచ్‌ఓ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా 'మధుమేహం-కారణాలు-నిరోధక చర్యలు'పై నెల రోజుల పాటు జరగనున్న వివిధ కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరిగిపోవడం, ప్రస్తుత ప్రజల జీవన శైలిలో.. తీసుకునే ఆహారంలో వచ్చిన మార్పులే మధుమేహానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించిన ప్రభుత్వం మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధుల నిరోధానికి ప్రభుత్వం జిల్లాకు ఒక వైద్యాధికారిని నియమించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం వలన జీవనశైలి వ్యాధులను నిరోధించవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల నిరోధమే లక్ష్యంగా మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ, ఎస్‌హెచ్‌ఓలు నెల రోజులు పాటు ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షులు డాక్టర్ సేవకుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ప్రాణాంతకంగా మారాయని ఆవేదన వ్యక్తచేశారు. ఈ వ్యాధుల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై.. సమాజ అభివృద్ధికి.. కుటుంబ అభివృద్ధికి అవరోధాలుగా పరిగణమించాయన్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక ఎస్‌హెచ్‌ఓ నందు ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, సుబ్రహ్మణ్యం, కుందేరు విజయ దీపక్ పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌తో ఎస్ఆర్ఎం ఎంఓయూ

విశాలాంధ్ర-మంగళగిరి : అంతర్జాతీయంగా పేరున్న యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా(యూఎస్ఎఫ్)తో ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విద్యాపరమైన అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. అధ్యాపకులకు లోతైన శిక్షణ, పరస్పర పరిశోధనలు, సాంకేతికత మార్పిడులు, ఇతరత్రా ప్రయోజనకర వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం రెండు యూనివర్సిటీల నడుమ ఎంఓయూ జరిగింది. యూనివర్సిటీ ఆవరణలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో యూఎస్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కి కీ కరుసన్, ఏపీ ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరాలు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఫ్లోరిడా యూనివర్సిటీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ మహాపాత్ర నేతృత్వం వహించారు. ఉమ్మడి పరిశోధనలను దశల వారీగా విస్తృతపర్చుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను పెంచుకునే వీలుందన్నారు. గ్లోబల్ అకడమిక్ ఎక్స్‌లెన్స్‌కు ఈ ఎంఓయూ దోహదపడుతుందని యూఎస్ఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ డాక్టర్ శ్వేత, డీన్లు డాక్టర్ రంజిత్ థాపా, డాక్టర్ మన్నాథన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలకు అవార్డులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలకు ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ నుంచి రెండు అవార్డులను పొందామని కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి తెలియజేశారు. యూనివర్సిటీ స్థాయిలో 2022-23కు గాను జాతీయ సేవా పథక ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా రేఖా నరేష్ బాబు ఉత్తమ జాతీయ సేవా పథకం వలంటీర్‌గా షేక్ షహనాజ్ ఎంపిక య్యారని, వీరిద్దరూ ఈ నెల 31వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల రెడ్డి సెమినార్ హాలులో ఈ అవార్డులను అందుకోనున్నారని తెలిపారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్ బాబు మాట్లాడుతూ కళాశాలకు రెండు అవార్డులు రావడం ఎంతో సంతోషమని, కళాశాలలో జాతీయ సేవా పథక కార్యక్రమాలు చేయడం కోసం అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ వలంటీర్లకు, సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ శౌరీలు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆర్.నరసింహా నాయక్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర, తెనాలి : ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ తెనాలి అధ్యక్షులు గురుబ్రహ్మం కోరారు. సోమవారం తెనాలిలో జరిగిన వివిధ ముఠా కార్మికసంఘాల సమావేశాల్లో ప్రచారం నిర్వహించారు. తెనాలి కమీషన్ మర్చంట్స్ ముఠా కార్మికసంఘం, డాల్‌మిల్ కార్మిక సంఘం, ఆటోడ్రైవర్స్ యూనియన్, కూరగాయల మార్కెట్ ముఠా కార్మికసంఘం సభ్యులను కలిసి గ్రూపు సమావేశాలు నిర్వహించారు. పట్టణంలో ఏఐటీయూసీ జెండాలను ప్రతిసెంటర్లలో ఎగురవేయాలని చెప్పారు. కార్మికులందరూ సమైక్యంగా వుంటే హక్కులు సాధించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో యం.శ్రీకాంత్, పవన్‌కుమార్, కోటిరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటప్పయ్య, నరసింహులు, వీరారెడ్డి, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2న ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో పాదయాత్ర

విశాలాంధ్ర-తాడికొండ : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నవంబర్ 2న గుంటూరు నగరంలోని చుట్టుగుంట సెంటర్ నుంచి మంగళగిరి పానకాల స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిత్యం ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయని ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికలలో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

వర్షం కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర-తాడికొండ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులు దుక్కులు దున్నారు. పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈసారి జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, కంది, సెనగ పంటలను వేసేందుకు రైతులు సిద్ధపడ్డారు. అయితే పంట పొలాలు కొంతమేర మాత్రమే పదునెక్కాయి. వెద పెట్టేందుకు పదును చాలటం లేదు. రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వల్లపు ప్రాంతాలలో అక్కడక్కడ వెదలు పెట్టారు. గడచిన రెండు మాసాలుగా వర్షాలు లేకపోవడంతో పొలాలు బెట్టకు వచ్చాయి. పంట పొలాలు పదునెక్కకపోవడంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఈవీఎంలు, వీవీపాట్ల గోడౌన్ల తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మాసాంత తనిఖీలలో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను, ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీపాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తనిఖీ చేసారు. ఇవియంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

CHANGE OF NAME

I, **VIPPLA OMKAR REDDY** (Old Name), S/o.(Late) VIPPALA PERI REDDY, R/o. Door No.2-89, Ankireddypalem, Nallapadu, Guntur - 522005, Guntur District, Andhra Pradesh, have changed my name to **VIPPALA OMKAR REDDY.** Hereafter my name is known as **VIPPALA OMKAR REDDY.**

దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటీ, బృందావన్ గార్డెన్స్ 5వ లైను, గీతాంజలి అపార్ట్ మెంట్ బ్లాక్ నెం.1, ఫ్లాట్ నెం.3 కాపురస్తులు మరస జితేంద్ర, S/o.సదా శివ నారాయణ అను నేను మాకు చెందిన మరియు గుంటూరు సిటీ లోని సాంబశివరావుపేట, 1వ లైను, సర్వే నెం.315 నందు గల డోర్. నం.10-1-10గా గల భవనమునకు సంబంధించిన మరస సదాశివనారాయణ (లేటు) గారి పేరు మీద గల గుంటూరు జిల్లా సబ్-రిజిస్ట్రారు లోని దస్తావేజు నెం.475/1963 నెంబర్ గల ఒరిజినల్ విక్రయ దస్తావేజులు, మరస వెంకటేశ్వర రావు గారి పేరుతో గల హక్కు విడుదల చేసిన ఒరిజినల్ హక్కు విడుదల దస్తావేజు నెం.8020/1980 గల ఒరిజినల్ దస్తావేజులు బ్యాగులో పెట్టుకొని యనమదల నుండి పార్వతిపురం NH-16 హైవే పై మోటార్ సైకిల్ పై వెళ్లి పార్వతిపురం దగ్గర చూసుకోనగా సదరు దస్తావేజులు ఉన్న బ్యాగు కనిపించలేదు. చుట్టు ప్రక్కల వెతికినా కనిపించలేదు. కావున సదరు దస్తావేజులు దొరికిన కింది ఫోన్ నెంబర్ కి తెలియజేసిన యెడల తగిన పారితోషికం ఇవ్వబడును. దొరికినవారు దుర్వినియోగపరిచిన యెడల చట్ట ప్రకారం తగు చర్య తీసుకోనబడును.
9666483616, 7702391444.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన కందుల సాయి కుమార్ రెడ్డి S/o.కందుల శ్రీనివాస రెడ్డి, R/o.పొన్నెకల్లు గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా. ఈయన తండ్రి గారిచే దఖలు పరిచిన దఖలు దస్తావేజు నెం.1589/2023 SRO తాడికొండకి సంబంధించిన లింక్ డాకుమెంట్ నెం.1427/1974, SRO తాడికొండను తీసుకొని పొన్నెకల్లు గ్రామము లోని తన ఇంటి నుండి ది.20-10-2023, బయలుదేరి సదరు డాక్యుమెంట్‌ను తన బైక్ యొక్క ఆయిల్ ట్యాంక్ కవరులో పెట్టుకొని తాడికొండ వెళ్ళుచుండగా పెట్రోల్ కోసం పెట్రోల్ బంక్‌కి వెళ్లినప్పుడు ఆయిల్ ట్యాంక్ కవరులో చూడగా దానిలో సదరు దస్తావేజు కనిపించలేదు. వెంటనే వచ్చిన దోవలో మరియు చుట్టుపక్కల ఎంత వెతికినను కనిపించలేదు మరియు మార్గ మధ్యమున విచారించినను ఫలితము లేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల దయచేసి ఈ దస్తావేజులను ఈ క్రింది చిరునామాకి అప్పగించగలరు.

కాసు వెంకట రెడ్డి, అడ్వకేట్,
డోర్.నెం.6-14-13, 14/3 అరండల్‌పేట, గుంటూరు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా ఏపీ ముందుండాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్న కల సీఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నెరవేరుస్తున్నారని జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి శివాజీ అన్నారు. సోమవారం గారపాడు జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఆరోగ్య సురక్ష కేంద్రం ద్వారా ఉచితంగా అందించే వైద్య పరీక్షలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెలుగొండ రెడ్డి ఎంపీడీవో నరసింహారావు వైసీపీ మండల కన్వీనర్ షరీఫ్, హైస్కూల్ చైర్మన్ కొండమీద వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు శివ, మాజీ ఎంపీటీసీ గోలి ఎలమంద, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురికి జైలుశిక్ష

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని వెలమావారిపాలెం గ్రామంలో 2016లో నమోదైన భార్యభర్తలపై దాడి కేసులో కోర్టు నలుగురు నిందితులకు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తుళ్ళూరి తిరుపతిరావు సోమవారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ వెలమావారిపాలెంకు అమరవరపు తిరుపతిరావు, ధనలక్ష్మి దంపతులను స్థల వివాదంలో అదే గ్రామానికి చెందిన వంగా వెంకటేశ్వర్లు, హనుమంతరావు, కోటేశ్వరరావు, చిన్నవెంకటేశ్వర్లు కర్రలతో కొట్టి గాయపరచినట్లు బాధితులు శావల్యాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఉమేష్ దర్యాప్తు చేసి కేసు నమోదు చేశారని, కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి ముద్దాయిలకు ఆరునెలలు కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.3వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండే వెంకటేశ్వర్లు కేసును వాదించగా కోర్టు కానిస్టేబుల్ గా శివనాగరాజు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.

సాంబశివరావు మృతి పార్టీకి తీరనిలోటు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మేదరమెట్ల సాంబశివరావు మృతి చెందటం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం పెద్దకర్మ సందర్భంగా సాంబశివరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో బాబాయ్, పిన్ని, అక్క అంటూ ఆప్యాయతగా పలకరిస్తూ పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అత్తిమళ్ళ రమేషు, బెల్లంకొండ రాంగోపాల్రావు, మద్యనేని సత్యనారాయణ, వడ్లమూడి అప్పారావు, గల్లా బాబురావు, వెల్లలచెరువు సురేష్, గంగినేని చిన్న, గంగినేని లీలావతి, ముంతాజు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

జడ్పీ హెచ్‌ఎంకు గురుస్పందన అవార్డు

విశాలాంధ్ర-పెదకూరపాడు : జడ్పీ ప్రధానోపాధ్యాయులు రమణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమణకు గురుస్పందన అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే గురుస్పందన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ అవార్డు రావడం ఆనందదాయకమని అన్నారు.

ఆర్డీఓను కలిసిన విజిలెన్స్ కమిటీ సభ్యురాలు

విశాలాంధ్ర-దుర్గి : గురజాల రెవిన్యూ డివిజన్‌కు ఆర్‌డీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీవీ రమణా కాంత్ రెడ్డిని సోమవారం జిల్లా విజిలెన్స్ కమిటీ(కంజుమర్స్) సభ్యురాలు తిప్పాబత్తుల రాణి, డీబీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ వడ్డె మధుసూధనరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారు గురజాలలోని ఆయన కార్యాలయానికి వెళ్ళి స్వీట్ బాక్స్ అందించి అభినందనలు తెలియజేశారు.

ఎంపీపీకి రాష్ట్ర పదవి

విశాలాంధ్ర-రెంటచింతల : ఎంపీపీ దాసరి చౌడేశ్వరికి రాష్ట్రస్థాయి పదవి వరించింది. తొగట వీరక్షత్రియ సంఘం రాష్ట్ర మహిళా ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి పదవి లభించటం పట్ల మండలంలో పలువురు నేతలు అభినందనలు తెలిపారు.

4న సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వెల్దుర్తి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నవంబర్ 4వ తేదీన సాధన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ప్రసాద్ రావు తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో ఉన్న ఎన్ఆర్ఈజీఎస్, తాగు నీరు, వైద్య ఆరోగ్య, మండల ప్రభుత్వ ఆఫీసుల పనితీరుపై సమీక్ష సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని చెప్పారు.

వజ్రగిరి జెస్టిస్‌కు అవార్డు



విశాలాంధ్ర-వినుకొండ: కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురం వారు 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో వినుకొండకు చెందిన వజ్రగిరి జెస్టిస్ గీసిన " పల్లెపడతి "ఆర్ట్ లెజెండ్ గోల్డెన్ పద్మ అవార్డు" లభిం చిందని పరిషత్ నిర్వాహకులు కొరసాల సీతారామ స్వామి ప్రకటించారు. గతంలో మూడు సార్లు ఇదే అవార్డును జెస్టిన్ సాధించారు. ఈ అవార్డును సాధించి వినుకొండ సీమకు అఖండ ఖ్యాతిని ఆర్జించి పెడుతున్న చిత్రకారుడు జెస్టిస్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు, కళాకారులు, కవులు, న్యాయవాదులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, వివిధ కళా సంస్థల నిర్వాహకులు అభినందించారు.

పిల్లలకు అనాథాశ్రయం

విశాలాంధ్ర-వినుకొండ: గుమ్మడి వృద్ధాశ్రమంలో గత 13 సంవత్సరాల నుండి అనాథ వృద్ధులకు వృద్ధాశ్రమం స్థాపించి సేవ చేస్తున్న గుమ్మడి దంపతులు మరో అడుగు ముందుకు వేసి తల్లి,తండ్రి లేని అనాథ పిల్లలకు అనాథాశ్రయం నిర్మాణం చేసేందుకు పూజా కార్యక్రమలు చేసి శంకుస్థాపనతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఐన గుమ్మడి. ప్రతాప్ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వృద్ధులకు ఆశ్రయం కల్పించి సేవా కార్యక్రమాలు చేస్తున్న సంగతి అందరికీ విధితమే మరో అడుగు ముందుకేసి అనాథ బిడ్డలను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని అనాథాశ్రయానికి శంకుస్థాపన చేయడానికి సంకల్పించామని అన్నారు. పట్టణంలో అనాథ పిల్లల కొరకు ఏర్పాటు చేస్తున్నటువంటి ఈ ఆశ్రమం మొట్టమొదటిది కావటం గమనార్హం అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి.వెంకటేశ్వర్లు, నిర్మాణ మేస్త్రిలు పాల్గొన్నారు.

కాపులు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది: అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : మంత్రి అంబటి రాంబాబు కాపుల గురించి హాట్ కామెంట్స్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు ఆలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైనదని, పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఎంతోమంది కాపులు ఆశపడ్డారు. ముఖ్యంగా కాపు యువత పవన్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు జైల్లో ఉంటే వాళ్ల కుటుంబ సభ్యులు తప్ప మరి ఎవరు వెళ్లలేదు. రజనీకాంత్ వస్తానన్నాడు ఆయన రాలా! ప్రభుత్వ ఖజానాను దోచుకొని ఎన్నో తప్పులు చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని, ఆయన పవన్ భుజాల మీద ఎక్కి అధికారంలోకి రావాలని చూస్తున్నాడు. చంద్రబాబు పవన్ కళ్యాణ్‌కి ఎన్ని సీట్లు ఇస్తాడో తెలియదు పవన్ ఎన్ని సీట్లు తీసుకుంటాడు ఆయనకే తెలియదు ఒక్క చంద్రబాబుకు మాత్రమే తెలుసు. ఆయన్ని పరామర్శించి పొత్తు ప్రకటించాడు. పొత్తు తర్వాత జనసైనికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పవన్ కళ్యాణ్ మాట విని జనసైనికులు ఆయన వెంట వెళితే కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లేనన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి పవన్ కళ్యాణ్ తాపత్రయపడుతున్నాడు. పవన్ కళ్యాణ్ దుర్మార్గమైన రాజకీయాలు చేస్తున్నాడు. ముఖ్యంగా కాపులు, కాపు యువత మోసపోవద్దు అని సూచించారు. పవన్ ముఖ్యమంత్రి కావాలని ఆశపడ్డ కాపు యువకులు కాపు సోదరులు చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధపడతారా? లేక రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేస్తారా అని ఆలోచించుకోవాలని అన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు వాతలు పెడతారు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలని మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు చూస్తే ఆయనకు ప్రజలు వాతలు పెడతారని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు హెచ్చరించారు. సోమవారం వినుకొండలోని 27వ వార్డులో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అధికారులతో కలసి ఎమ్మెల్యే పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ తిరుగుతూ అందరినీ పలకరించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా వైసీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. దివంగత మహానేత డాక్టరు వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వైద్యం, ఉచిత విద్య, రైతు రుణమాఫీ, ఫీజురీఎంబర్స్‌మెంట్, ముస్లిం మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని కోరారు. తాను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోపే 40 ఎకరాలుగా ఉన్న సింగరచెరువును 270 ఎకరాలకు పెంచి మంచినీటి సమస్యను తొలగించానని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అనేక అభివృద్ధి పథకాలను అడ్డుకునేందుకు కోర్టులకు వెళ్లడం తప్పా జీవీ ఆంజనేయులుకు ఏమీ తెలియదన్నారు. పట్టణంలో పేద లకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఏరియా ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, దాని పక్కనే బాలికల ఉన్నత పాఠశాల పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. జీవీ మంత్రి కావాలని కంటున్న కలలు కల్లలుగానే మిగిలిపోతాయని చెప్పారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతం రుణం తీర్చుకోవడానికే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కౌన్సిలర్ హేమలత, మునిసిపల్ చైర్మన్ డా. దస్తగిరి షకీలా, యార్డ్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పి.ఎస్.ఖాన్, ఎం.ఎస్. కె.భాష, దండు చెన్నయ్య, నసరారెడ్డి, వైస్ చైర్మన్ లు గాబ్రియేలు, రాకేష్ కన్న, మునిసిపల్ కమిషనర్ డి. ఈ వెంకయ్య, శానిటరీ అధికారి చెన్నకేశవులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు నమోదు చేయించిన వైసీపీశ్రేణులు: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణ టీడీపీ అధ్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో 19 వార్డులో సోమవారం రాత్రి నిర్వహించిన 'బాబుతో నేను', 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా టీడీపీ అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు వార్డులోని ఇంటింటికి తిరిగి భవిషత్తు గ్యారంటీ కరపత్రాలని ఇచ్చి ఎన్నికల మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ నాయకులు నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, మిస్టర్ డొల్లా బాబా అధికారాన్ని అడ్డం పెట్టుకొని వందల కోట్ల అవినీతి సొమ్మును దోచుకున్నాడని అన్నారు. మీ అవినీతి అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లి ప్రజాక్షేత్రంలో మీకు సమాధానం చెప్పడం జరుగుతుందన్నారు. ఇటువంటి అవినీతి అక్రమార్కులను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. పల్నాడు ప్రాంతంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడి నివారణకు నాడు టిడిపి ప్రభుత్వం రూ.600 కోట్లతో ప్రవేశపెట్టిన వాటర్ గ్రిడ్ పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి నీటి కొళాయి ఇచ్చి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. చంద్రబాబుపై అక్రమ కేసులు అరెస్టులపై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీం ఖాన్, పత్తి పూర్ణచంద్ర రావు , సౌదాగర్ జానీ భాష,పల్లమీసాల దాసయ్య, గంధం కోటి నాగేశ్వరరావు, తెలుగు యువత జానీ ఆలీ, పువ్వాడ కృష్ణ, కృష్ణ, సుబేదారి అజీత్, సుబేదార్ భాష, వికారి, దస్తగిరి, తోమాటి కాశి, , లక్ష్మి ,చౌడమ్మ ,బసవమ్మ ,ఈశ్వరమ్మ, సిడి పాయింట్ భాష, బూత్ కన్వీనర్ జిలాని కాలంగి శీను, గంగినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సోమవారం శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన బొల్లా బ్రహ్మనాయుడు ప్రసంగిస్తూ నవంబర్ 7వ తారీఖున వినుకొండ నియోజకవర్గంలో జరగబోయే సామాజిక సాధికార యాత్ర జయప్రదం చేయాలనేదే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ యాత్ర ముందుగా మన నియోజకవర్గంలోని నూజండ్ల మండలం ముప్పరాజు వారి పాలెం గ్రామం నుండి ప్రారంభమౌతుందని, అక్కడి నుండి నూజండ్ల మీదుగా సాయంత్రం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటామని, వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అన్ని శాఖల మంత్రులు అఈ సభ లో పాల్గొని ప్రసంగాలు చేయనున్నారని తెలిపారు. ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్అండ్‌బి రోడ్డు బాగు చేయండి

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావుపేటకు మాచర్ల నుండి వెళ్ళే రోడ్‌లో అడిగొప్పల నుండి గుత్తికొండ వరకు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని ఆ రోడ్డుకు మరమత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ సోమవారం జిల్లా కలక్టరేట్‌లో జరిగిన స్పందనలో కలెక్టర్‌కి వివిధ ప్రజాసంఘాల నాయకులు మెమోరాండం అందచేశారు. ఈ కార్యక్రమంలో కోట నాయక్, షేక్ మస్తాన్వలి, వైవి, నల్లపాటి రామారావు, శ్రీను నాయక్, కోలా నవజ్యోతి, షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.

గుమస్తాల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర-వినుకొండ: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందలి గల న్యాయవాద గుమస్తాల సంఘం సర్వసభ్య సమావేశంలో అధ్యక్షునిగా కాకర్ల చిన్నదానం మరియు కార్యదర్శిగా గుంజరి నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదులు గుమస్తాలు సంక్షేమ సంఘానికి కృషి చేస్తామని వివరించారు.

స్పందనకు 170 ఫిర్యాదులు

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన జరిగిన జగనన్నకు చెబుతాం "స్పందన" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా డిఆర్‌ఓ వినాయకంలు స్వీకరించారు. మొత్తం 170 అర్జీలు వచ్చినట్లు వాటిని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి అర్జీలను ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు పరిష్కార మార్గం చూపించాలని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని పిలుపు నిచ్చారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఫిర్యాదు దారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు శాఖ ఉచిత అన్నదానాన్ని కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు-అభివృద్ధికి మదుపు : జేసీ

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యుత్ పొదుపు-అభివృద్ధికి మదుపు అనే నినాదం విద్యుత్ వాడకం దారులకు పొదుపు పాటించడం ద్వారా అలవర్చుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. విద్యుత్ వాడకంపై ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా పల్నాడు జిల్లా ఏపీసిడిపిసిఎల్ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కలెక్టరేట్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్‌ఓ వినాయకం, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పొదుపు ఇంధన చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం వల్ల నిరంతరం వినియోగించుకోవడానికి, వ్యవసాయ పంటలకు 9 గంటలు, గృహ వినియోగానికి 24 గంటలు వినియోగించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోడ పత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యుత్ పొదుపు పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు కాపాడండి: అరవింద బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా ఆస్తులు కబ్జా చేయడంలో నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరితేరిపోయాడని, అతని నుండి నియోజకవర్గంలో భూములు కబ్జా కాకుండా కాపాడాలంటూ నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో భూములకు రక్షణ లేకుండా పోతోందన్నారు. నరసరావుపేట పట్టణంలోని స్థానిక 5వ వార్డులో ఎకరం రూ.5 కోట్లకు పైగా పలికే నాలుగున్నర ఎకరాలు కబ్జాకు గురయ్యాయని అన్నారు. వల్లపుచెరువు వద్ద దేవాలయ భూములు, ఉప్పలపాడు వద్ద 200 ఎకరాల్లో లే అవుట్ వేయగా అందులో 45 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేసి అందులో కలిపేశారున్నారు. ఇలా అడుగడుగునా ప్రభుత్వ భూముల్ని కబ్జా చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా ఈ ఆక్రమణల పై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయన్నారు. అధికార పార్టీ నాయకుల కబ్జాలు, దుర్మార్గాలపై అధికారులు స్పందించకుంటే ప్రజలకు భద్రత కల్పించడ ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటైనా అధికారులు స్పందించి ప్రజల ఆస్తుల్ని కాపాడాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు డా.చదలవాడ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమౌళి,దుర్గ గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని యండ్రాయి గ్రామంలో 'బాబుతో నేను' కరప్రతాలను పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని దిడుగు గ్రామంలో 'బాబుతో నేను' కర్రప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ చంద్రబాబు లాంటి నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తిపై అక్రమ కేసులు బనాయించి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి యువజన నాయకులు పిలుపునిచ్చారు. నరసరావుపేట ఎన్జీవో హోమ్ సోమవారం జరిగిన రౌండ్ టేబుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు, ఏఐఎస్ఎఫ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్జి, ఏపీఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి వేముల శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సాయి,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయి, ఏఐవైఎఫ్ నాయకులు జంగాల చైతన్య మాట్లాడుతూ అనేక త్యాగాలతో విద్యార్థి యువజన నాయకుల 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరు గుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు నవంబర్ 8వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. లాభా లు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలు అభివృ ద్ధికి నిధులు ఇవ్వకపోయినా నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలు అన్నిటిపై నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ఎందుకు అడగడం లేదని విమర్శించారు. రైతు సంఘం నాయకులు గోపాలరావు, తాళ్లూరి బాబురావు, ఉలవల పుడి రాము, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కసా రాంబాబు, బుదాల శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పెద్దలు నిద్ర నటిస్తున్నారని రాష్ట్ర ప్రయోజ నాల కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు కేసుల భయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారని భయపెట్టారు రాష్ట్ర విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. నవత ´రం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, ఎమ్మార్పీఎస్ నాయకులు అడపా మోహన్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీను నాయక్, ఎంఐఎం నాయకులు కరిముల్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఆచరణలో పురోగతి లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలి పే సహకరించాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు ఉప్పల పాటి రంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదాన వెంకట్, కేవీపీఎస్ నాయకులు సుందరయ్య, గాంధీ స్మారక సంఘం గోపీ చంద్, ఏఐవైఎఫ్ నాయకులు ఆనంద్, హర్ష పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే దేశానికి వెన్నుముకైనా రైతు సంతోషంగా ఉంటే ఆయా సామాజిక వర్గాలు పరిశ్రమలు దినదినం అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాము అన్నారు. సోమవారం నరసరావుపేటలో గ్రీవెన్స్ సెల్‌లో జిల్లాలో వర్షపాతం లేక ఎండిపోయిన పంటలతో ఆర్తనాదాలతో రైతులు ఆందోళన చెందుతూ ఉంటే ప్రభుత్వాలు పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 155 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నప్పటికీ శ్రీశైలం, నాగార్జునసాగర్ దిగువ పులిచింతల ప్రాజెక్టులు ఉన్న పంట పొలాలు బీడు భూములుగా మారి నీరు లేక నెర్రలు కొడుతూ పంట ఎదుగుదలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో పాటు జిల్లాలో ఆయా నియోజకవర్గాలలో మౌలిక సదుపాయాలు రూపకల్పనలో అధికారులు పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటాన్ని ఖండించారు. పై విషయాలపై జిల్లా కలెక్టర్‌ని కలిసి నాగార్జునసాగర్ పులిచింతల నుంచి ఎండిపోయిన పంట పొలాలకు నీరందించి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతాంగ సమస్యల పరిష్కారం వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, రైతు సంఘం నాయకులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అచ్చంపేట : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అగ్నిప్రమాదంలో చిన్నారిని కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు. అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలో జూన్ 14న అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో 8 పూరి గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో 9 నెలల చిన్నారి జెర్రిపోతు పల్లవి ప్రాణాలు కోల్పోయింది. తల్లి అనిత, అమ్మమ్మ మేరమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో తమ ఇంటి దీపమైన పల్లవి మృత్యువాత పడడంతో ఆ ఇంట్లో కన్నీళ్లే మిగిలాయి. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మానవత్వాన్ని చాటుకున్నారు. మరణించిన చిన్నారి కుటుంబానికి తక్షణ సాయంగా తన సొంత డబ్బు రూ.50 వేలు సాయం అందించారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వారికి రూ.2 లక్షల సాయం అందింది. దానికి సంబంధించిన చెక్కును.. చిన్నారి పల్లవి తండ్రి జెర్రిపోతు వెంకట్రావుకు అందించారు. ఆయనకు పల్లవి తండ్రి, ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లచెరువులో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-అచ్చంపేట : శాసనసభ్యులు నంబూరు శంకరరావు అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ముఖ్యనాయకుల ఇళ్లను సందర్శించారు. గ్రామంలోని దొండేటి పాపిరెడ్డి, నెక్కంటి శౌరెడ్డి, దొండేటి బాలరెడ్డి(మాజీ డీలర్), తుమ్మా జోసఫ్ రెడ్డి, ఉడుముల స్లీవరెడ్డి, ఏరువ వేళాంగిణి రెడ్డి, అల్లం అంథోన్ రెడ్డి, తుమ్మా చిన్నపరెడ్డి ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే. వారిని ఆత్మీయంగా పలకరించారు. గ్రామంలో తీర్చాల్సిన సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గత ఎన్నికల్లో వారు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గంలో మరోసారి వైసీపీ జెండా ఎగురవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామంలోని నాయకులందరూ వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు.

జనసేన నుంచి వైసీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : వైసీపీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం, గుర్తింపు లభిస్తుందని, ఎన్నికల సమయంలో జనసేన నుంచి వైసీపీలోకి చేరికలు పార్టీ శ్రేణులకు ప్రోత్సాహాన్నిస్తాయని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు ఆధ్వర్యంలో జనసేన నేత రాయుడు బాలకృష్ణ, ఆయన మిత్రబృందం అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ఎన్నికలకు సమయంలో ప్రతిపక్ష పార్టీ నుంచి యువత, నాయకులు వైసీపీలో చేరటం ఈ ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు. రాయుడు బాలకృష్ణకు, ఆయన మిత్రులకు అభినందనలు తెలియజేసి, పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక నాయకులతో కలిసి పనిచేసి, పార్టీ అభివృద్ధికి, విజయానికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, కౌన్సిలర్ ఆకుల రమేష్, రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, తోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరియదాసుకు కొమ్మాలపాటి నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని యండ్రాయి గ్రామంలో సోమవారం కాకి మరియదాసు మరణించగా వారి భౌతికకాయానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్య సేవలు: క్రిస్టీనా

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరుతూ ఇంటి వద్దకే కార్పోరేట్ వైద్య సేవలు కల్పించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండాలపాడు గ్రామంలో సోమవారం జరిగిన సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న క్రిస్టీనా వైద్య శిబిరాలను పరిశీలించి వైద్య సేవలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసిడియస్ అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శించి ఆహార పదార్థాలను రుచి చూచి కితాబిచ్చారు.అదేవిధంగా వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లను అందజేశారు. అలాగే కళ్ళ జోళ్ళను కూడ క్రిస్టీనా చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూదేశంలో ఏ రాష్ట్రంలో అమలు లేని సంక్షేమ పథకాలు సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు కల్పించిన జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి. షేక్. షహెలా నర్గీస్, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, పెరికల జేమ్స్, సర్పంచ్ కంభం పెదబాబు, వైస్ ప్రెసిడెంట్ కాంద్రు దాసయ్య, మాజీ ఎంపిపి ఆళ్ళ కృష్ణమూర్తి, కొల్లి వీర వసంతరావు, బేతపూడి సొసైటీ చైర్మన్ ఖాజావలి, తహశీల్దార్ డి.పద్మనాభుడు, సెక్రటరి శారద, విఆర్వో కె.సాంబయ్య, వైద్యులు ఫరీనాబేగం, శాంతి, మేఘన, భీమేశ్వర్ నాయక్, సిహెచ్‌వో. ఎస్.వి.లక్ష్మీ, పిహెచ్ఎన్ ఎం.గాయత్రి, హెచ్ఎస్ రహిమాన్, హెచ్‌వి. ఖాజాబి, మరియు ఎంఎల్‌హెచ్‌బీలు, ఏఎన్‌యంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రావి' మాతృమూర్తి దశదిన కర్మకు ప్రముఖులు

విశాలాంధ్ర-పర్చూరు: వైసీపీ పూర్వ ఇన్‌చార్జి రావి రామనాథంబాబు మాతృమూర్తి సీతారావమ్మ ఇటీవల మృతి చెందగా.. సోమవారం మండలంలోని అడుసు మల్లిలో దశదిన కర్మ జరిగింది. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సీతారావమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. వారిలో రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, మాజీ మంత్రి వసంత నాగేశ్వర రావు, మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్తపేట నివాసి,పేద విద్యార్థిని సంయుక్తకు పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రేమ నర్సింగ్ హోమ్ నందు వైకాపా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్. ఐ.బాబూరావు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినికి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుభాషిణి, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-కొల్లూరు : అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన కొల్లూరు మండల పరిధిలోని చిలుమూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలుమూరులో శ్రీరామ్ సుశీలరావు అనే వ్యక్తి మద్యం అధిక ధరలకు అక్రమంగా విక్రయాలు చేస్తున్నట్లు అందిన సమాచారంతో కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి చిలుమూరులో తనిఖీలు నిర్వహించారు. మద్యం సీసాలతో ప్రయాణిస్తున్న సుశీలరావును నిలువరించి పరిశీలించగా రూ. 4200 విలువ చేసే 30 మద్యం సీసాలు లభించడంతో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం పంచాయతీలో ఉన్న పుల్లాయిపాలెం, లింగాపురం గ్రామాలలో సాగు చేసిన వరి పొలాలను చీరాల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేర్లీ డ్రైన్‌పై ఉన్న ఎత్తిపోతల పంపింగ్ స్కీం ద్వారా సాగు అవుతున్న నక్కలవారిపాలెం, దేవినూతల పుల్లాయపాలెం, లింగాపురంలో 800 ఎకరాలు వరి సాగు చేస్తున్నారన్నారు. నీరు సక్రమంగా అందుతుందని తెలిపారు. పొలాలు కూడా బాగానే ఎదుగుతున్నాయన్నారు. పైర్లను ఆశించు దోమ, పురుగు, తెగులు నివారణల గురించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు విజ్ఞప్తి

విశాలాంధ్ర - చీరాల : ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు పిఎఫ్,ఎస్ఆర్ బి.ఎస్ లైఫ్ సర్టిఫికెట్లు నవంబరు నెలలో ఇవ్వవలసి ఉన్నందున ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఫస్ట్ పేజీ, గుర్తింపు కార్డు కాపీలను తీసుకొని డిపో కమిటీని కలసి లైఫ్ సర్టిఫికేట్ల కోసం అప్లికేషన్ పూర్తి చేయాలని రిటైర్డ్ అసోసియేషన్ డిపో కార్యదర్శి సి. హెచ్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పేటేరులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని పేటేరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కనపర్తి రవికిరణ్ అన్నారు. మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ ఎంపీ మోపిదేవి వెంకటరమణ రావు చొరవతో గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. ఇప్పటికే పలు సీసీ రోడ్డులను వేసినట్లు తెలిపారు. గ్రామా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మేడికొండ సుధాకర చంద్రహాస రావు, పంచాయతీ కార్యదర్శి పుష్ప కుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రావు ప్రభాకర్ రావు, వార్డు నెంబర్లు వైఎస్ఆర్సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

దేవాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-అద్దంకి ; సింగరకొండ వద్ద గల అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములకు సోమవారం అన్నదానం ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య స్వాములకు అన్నదానం ప్రారంభించారు. గత 13 సంవత్సరాల నుంచి అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం నిర్వహిస్తున్నామని,4 8 రోజుల పాటు నిర్వహించనున్న అన్నదానాన్ని మాల వేసుకున్న అయ్యప్పస్వాములు, శివస్వాములు, భవానీ దీక్షాపరులు సద్వినియోగం చేసుకోవాలని అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు..

విశాలాంధ్ర-అద్దంకి; ప్రజాసమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. జె,పంగులూరు మండలం జనకవరం గ్రామంలో సోమవారం జరిగిన ఈ కార్యక్ర మంలో కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్దిని వివరించారు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలు,మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిందన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

జె,పంగులూరు మండలం పంగులూరు గ్రామం మాగుంట సుబ్బరామిరెడ్డి,బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గోవాలో జరిగే జాతీయ క్రీడాపోటీలకు ఎంపికైన ఏ.పి పురుషుల కోకో జట్టు క్రీడాకారులకు సోమవారం క్రీడా కిట్లను శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పంపిణీ చేశారు.

బాపట్లలో విజయ్‌కుమార్ విజయపథం యాత్ర

పేదరికం విముక్తి, ఐక్యమత్యమే లక్ష్యంగా..

విశాలాంధ్ర - బాపట్ల : పేదరికం నుంచి విముక్తే ధ్యేయంగా ఐక్యమత్యమే లక్ష్యంగా మాజీ ప్రభుత్వ కార్యదర్శి విశ్రాంతి ఐఏఎస్ విజయ్‌కుమార్ చేపట్టిన విజయపథం యాత్ర సోమవారం 70వ రోజు బాపట్లకు చేరుకుంది. బాపట్ల చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న మహాత్మ జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా దప్పు వాయిద్యాలతో మహిళల కోలాటాలతో యాత్ర లక్ష్యాలను ప్రచారం చేసుకుంటూ యాత్ర చేపట్టారు. తవ్వకాలువ వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి జమ్ముల పాలెం ఫ్లైఓవర్ దగ్గర ఉన్న సభాస్థలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక అధ్యక్షతన జరిగిన సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల సమస్యలను తెలుసుకునేందుకు యాత్రను చేపట్టినట్లు తెలిపారు. తడ నుంచి చేపట్టిన యాత్రలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని సమస్యల తన దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. ఇప్పటి వరకు నాలుగు జిల్లాల్లో పర్యటన సాగిందని సుమారు 1264 కిలోమీటర్ల యాత్ర చేశామన్నారు. సమాజంలో పేదరికం పలు రూపాలలో వేళ్లూనుకుందని తరాలు మారినా అంతరాలు మారటం లేదన్నారు. గతంలో కలెక్టర్ పనిచేసిన పాడేరు, పార్వతీపురం రంపచోడవరంలో రెవిన్యూ డివిజన్‌లు కూడా ఉన్నాయని మన బాపట్ల ప్రాంతంలో లేకపోవటం ఆశ్చర్యాన్ని కల్గించిదన్నారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం చేసే సమయంలో తాను ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్నానని బాపట్ల జిల్లా ఏర్పాటు చేసే సమయంలో బాపట్ల,వేమూరు,రేపల్లె,చీరాల,అద్దంకి పర్చూరు నియోజకవర్గాల్లో ఏ ఒక్క నియోజకవర్గం రెవిన్యూ డివిజన్‌గా లేదని తొలి ప్రాధాన్యతగా బాపట్ల, చీరాలను రెవిన్యూ డివిజన్ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2 కోట్ల హెక్టార్ల సాగు భూమి ఉందని కేవలం 7 శాతం భూమి మాత్రమే దళిత,గిరిజన, వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తుల వద్ద ఉన్నాయన్నారు. మభ్యపెట్టి బెదిరించి భూములను పెత్తందారులు అక్రమంగా లాగేసుకున్నారని తెలిపారు. స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిన ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజలకు, వెనుకబడిన తరగతుల వారికి సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. పేదల అబివృద్ధికి సమగ్రమైన విధానం తీసుకురావలనే లక్ష్యంతో రాష్ట్ర యాత్ర చేపట్టినట్లు తెలిపారు. పేద,వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన మనందరికీ మంచి రోజులు రావాలనే లక్ష్యంతో యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. నాతో పాటు నడుస్తున్న ప్రతి ఒక్కరికి నాతో కలిసి పయనించే వారంతా కలిసి మన హక్కులు మనం సాధించుకునేందుకు పోరాడదామని పిలుపునిచ్చారు. అనంతరం విజయ్‌కుమార్ అతని భార్య విజయ్‌శ్రీని పూలమాలలు దృశాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, దళిత నాయకుడు ముప్పిరి రాజశేఖర్, జెట్టి జోసఫ్, తిరువీధుల శంకర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో సాల్వేషన్‌ఆర్మీ డీసీ మాలమహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు, బహుజన కెరటాల వ్యస్థాపకుడు పల్నాటి శ్రీరాములు, మైనార్టీ నాయకులు పఠాన్ రాజేష్, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం రోజన్‌బాబు,గొర్రెముచ్చు వందనం, గుజ్జర్లపూడి అంబేద్కర్ తదితరులున్నారు.

ధరలు నియంత్రించండి

విశాలాంధ్ర - చీరాల : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి,నిత్యావసర ధరలు చెత్త పన్నులను రద్దు చేసి ధరలను నియంత్రించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నారు.దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో ధరలు అదుపు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షేక్ జిలాని మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు గణనీయంగా పెరిగిపోతున్నాయని, విద్యుత్ బిల్లుపై ట్రు అప్ చార్జీలని,బొగ్గు చార్జీలని,అధిక లోడు చార్జీలు అని ఇలా రకరకాలుగా వచ్చిన బిల్లు కంటే రెండు రెట్లు అధికంగా బిల్లు వసూలు చేస్తున్నారన్నారు.ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు.సత్వరమే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించాలని లేకుంటే రాష్ట్రమంతా నిరసనలు చేపడతామన్నారు.నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని సామాన్య ప్రజలు నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకొని నిత్యావసరల ధరలను తగ్గించాలని,అంతే కాకుండా ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా కందిపప్పు,పంచదార,గోధుమలు,మినపప్పు లాంటి వస్తువులను ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో చెత్త పన్ను విధించారని దానిని వెంటనే రద్దు చేయాలని,దేశంలో రైలు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రైలు ప్రమాదాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మానవ తప్పిదాల కారణంగానే రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయివేటీకరణ వలన ఇలాంటి దుష్పరిణామాలు సంభవిస్తాయన్నారు.ఆదివారం జరిగిన రైలు ప్రమాద మృతులకు కేంద్ర ప్రభుత్వం 25 లక్షలు నష్టపరిహారం అందించాలని, క్షతగాత్రులకు ఐదు లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం చీరాల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ ఖాదర్,షేక్ ఇబ్రహీం, షేక్ బుజ్జి,సయ్యద్ అజ్మల్, షేక్ బాజి,షేక్ రబ్బానీ,తులసి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు రిజిస్ట్రార్లు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగలాముఖి అమ్మవారి ఆలయంను సోమవారం హైకోర్టు రిజిస్ట్రార్లు రాజీవ్ గౌడ్, జయశంకర్, ఉమాశంకర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ఘనస్వాగతం పలికి అమ్మవారి జ్ఞాపికను అందజేసి అమ్మవారి చరిత్రను వివరించారు. ఎంతో ఘన చరిత్ర కలిగి ఉన్న మహిమ గల బగలాముఖి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు.

కౌన్సిల్‌లో 70 అంశాలు ఆమోదం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని 70 అంశాలు ఆమోదం పొందాయి. మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ముందుగా కొత్తగా నియమితులైన టీపీఓ బాబూరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కొండయ్యలను పరిచయం చేశారు.అనంతరం స్వల్పచర్చ మినహా సభ్యులు అన్ని అంశాలను ఆమోదించారు. స్థానిక గడియార స్తంభం వద్దనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు పార్కింగ్ గురించి సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారు.తోకల అనిల్ కుమార్ గతంలో నిర్ణయం తీసుకున్న పెయిడ్ పార్కింగ్ విషయం గుర్తుచేశారు.మించాల సాంబశివరావు మాట్లాడుతూ తనకు,అక్కడ ఉన్న వ్యాపార సంస్థకు ఎటువంటి సంబంధం లేదన్నారు.కారు పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరారు.ఈ దశలో ఛైర్మన్ మాట్లాడుతూ అక్కడ సెల్లార్‌లో ఉన్న ప్రదేశాన్ని మూడు విభాగాలుగా విభజించి పార్కింగ్‌కు ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు,వాచ్ అండ్ వార్డ్ ఖర్చులు దుకాణదారులు భరించాలని తెలిపారు. ఇందుకు అసంతృప్తి వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ తోకల అనిల్ కుమార్ సమావేశం నుండి బయటకు వెళ్లారు. మొత్తానికి స్వల్ప చర్చ మినహా అన్ని అంశాలు ఆమోదం పొందిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఈ యేసయ్య, ఏ.ఈలు కట్టా రవికుమార్, శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దైవ ప్రార్థనే ఆధ్యాత్మిక ఆయుధం

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రతి మనిషి ఆధ్యాత్మిక ఆయుధాలైన ప్రేమ,కరుణ,దయాగుణం నీతి కలిగి ఉన్నప్పుడే దేవుని మార్గంలో పయనిస్తున్నాడని అర్థమని,అలాంటి వ్యక్తికి దేవుడు కృపా కటాక్షం ఎల్లప్పుడూ ఉంటాయని కడప అమీర్ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజీ సాయేషా అరిఫుల్లా హుస్సేన్ అన్నారు.మండలంలోని పూనూరు గ్రామంలో నూర్ భాషా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మాబు సుభాని గార్మి జెండా చెట్టు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తొలుత గార్మి జెండా చెట్టు వద్ద గంధం ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదిస్తూ దేవుని కృప కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థన నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండ్లూరి అహ్మద్, షేక్ పీర్ సాహెబ్, ఖాసిం సాహెబ్ ,హుస్సేన్, మీరా వలి,ఎండ్లూరి పెద్ద ఆంజనేయులు, శ్రీను, ఇమాం సాహెబ్ పరిసర గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ సీఎన్‌ఎఫ్‌లకు శిక్షణ

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం మండల వ్యవసాయ అధికారి ఏ.కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం వేటపాలెం1లో సోమవారం ఏ.పీ.సి.యన్.ఎఫ్ కేడర్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులందరూ ఏ.టి.ఎం మోడల్ వేయించాలని.వాటి ద్వారా ఆదాయాన్ని పొందే విధానాన్ని రైతులందరికీ అవగాహన కలిగించి ఉద్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వి.ఏ ఏ. సునీల్, ఏ.పీ. సీ.యన్. ఎఫ్.యం.టి. భారతి, యూనిట్ ఇన్చార్జులు, ఐ.సి.ఆర్.పిలు పాల్గొన్నారు.

గ్రామస్థాయికే ఉత్తమ వైద్యం : ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర - బాపట్ల : గ్రామ స్థాయికే ఉత్తమ వైద్యం అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ విద్య వైద్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎన్నో సంస్కరణలు చేసి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. అన్నీ రకాల వ్యాధులకు అనుభవిజ్ఞులైన వైద్యులచే పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారన్నారు. ప్రజారంజక పాలన అందిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి మనమంతా గెలుపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ భానుప్రతాప్, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మత్స్యశాఖ స్టేట్ డైరెక్టర్ చెంచయ్య,వడ్డీముక్కల డేవిడ్ తదితరులున్నారు.

జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రతి జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని సమాజవాది జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు అన్నారు సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అక్షరాస్యత కేవలం 18శాతం ఉండేదని కానీ నేడు 77.70శాతం సుమారు 4.5 రెట్లు పెరిగిందని వివరించారు. ప్రభుత్వాలు విద్యావంతులుగా మారిన యువతను ఉద్యోగస్తులుగా చేయవలసిన ప్రక్రియలో భాగంగా ప్రతి జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ ఆర్థికంగ వెనుకబడిన, నిరుద్యోగ యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులు బ్యాంకులు,ప్రైవేటు కార్పొరేట్ సంస్థల ఉద్యోగాల పోటీ పరీక్షలలో తమ నైపుణ్యాలు పెంచుకొనటానికి కోచింగ్ సెంటర్లుకు వెళ్లి ఫీజులు లక్షలు చెల్లించే స్థితిలో లేరన్నారు.ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి నిపుణులైన శిక్షకులు మేలు రకమైన మౌళిక సదుపాయాలు కల్పించి సమాజ అభివృద్ధికి తోడ్పడతారన్నారు. బహుజన బీసీ మైనార్టీ వర్గాల నాయకులు బోయిన సూరిబాబు, కొమ్మనబోయిన ఫణీంద్ర, గండికోట వెంకటరావు నాగూర్, పీలా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకుర్చాలి

విశాలాంధ్ర - బాపట్ల : స్పందన ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకుర్చాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి. మహేష్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించారు.కుటుంబ కలహాలు,భూ వివాదాలు,ఇతర సమస్యలపై 62 మంది ఫిర్యాదీదారులు సమస్యలను విన్నవించుకున్నారు.పిటీషనర్ల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని,సంబందిత పోలీస్ అధికారులతో స్వయంగా మాట్లాడి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు.ఈ స్పందన కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్స్పెక్టర్ వి.మాలకొండయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా

విపత్తులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ మల్లి కార్జున రావు అన్నారు. మండ లంలోని పెనుమూడి గ్రామంలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ కృష్ణ నది పరివాహక, సముద్ర తీర ప్రాంతాలలో సంభవించే వరదలు తుఫానులు సునామీల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదలు, తుఫానులు సంభవించినప్పుడు ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా పెద్ద ఎత్తున జరుగుతుందని, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను అనుస రించాల్సిన విధానాలను చర్చించారు. అనుకొని ప్రమాదాలలో గాయాలు పాలైనప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ మేరకు ప్రజలకు, తమ ప్రాణాలు కాపాడుకోవడం తోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్డిఆర్‌ఎఫ్ సిబ్బంది అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యాభారతి

విశాలాంధ్ర - చీరాల : విద్యాభారతి స్మార్ట్ స్కూల్ విద్యార్థులు చదువులోనే కాదు ఆటలలో సైతం సత్తా చాటుతారని విద్యాభారతి స్కూల్ కరస్పాండెంట్ మళ్ళా వాసవి చంద్రిక అన్నారు. ఈ నెల 29న జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ఆధ్వర్యంలో మంగళగిరిలో నిర్వహించిన 8వ జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యాభారతీ స్మార్ట్ స్కూల్ విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ మళ్ళా వాసవి చంద్రిక, విజయకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ రాష్ట్రా లకు చెందిన ఆరు వందల మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా ఈపురుపాలెం విద్యాభారతీ స్మార్ట్ స్కూల్‌కు చెందిన జి.భవ్యశ్రీ, టి.వినమ్రత లక్ష్మి,ఎస్కే.నాగుల్ జాను ముగ్గురు విద్యార్థులు స్వర్ణ పతకం సాధించారన్నారు. అలాగే ఏ.వెంకట సాయి, ఝాన్సీ కాంస్య పతకం సాధించారని, ఈ ఘనవిజయానికి కారణమైన విద్యార్థులని కరాటే మాస్టర్ టి.మోహన్ కృష్ణని అభినందిస్తున్నామన్నారు.

బాబు, పవన్‌వి నిలకడలేని రాజకీయాలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కళ్యాణ్‌వి నిలకడ లేని రాజకీయాలు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రామయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ పెట్టి 15 ఏళ్ళు అవుతున్నా స్వంతగా ప్రయత్నించకుండా ఏ పార్టీ ప్యాకేజీ ఇస్తే ఆ పార్టీలకు పల్లకీలు మోసే పవన్ కళ్యాణ్ జనసేన నాయకులను రాష్ట్రప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. బాపట్లలో సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని జిల్లా సాధకుడు ఎమ్మెల్యే కోన రఘుపతి సుమారు 5 వేల మంది ప్రజలతో విజయవంతం చేస్తే బాపట్ల జనసేన పార్టీ కార్యాలయం నుంచి కొంతమంది చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. ఖబడ్దార్ నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు..2024లో పెత్తందారులకు పేదప్రజలకు జరుగబోతున్న యుద్ధంలో సిఎంగా మళ్ళీ జగనన్నను చేసుకునేందుకు కృషిచేస్తామని మళ్ళీ మూడోసారి ఎమ్మెల్యేగా కోన రఘుపతిని భారీ మెజారిటీతో గెలుపించుకుంటామని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులను గెలిపించుకొని బాపట్ల జిల్లా జగనన్న అడ్డాగా చేసుకుని తీరుతామని చల్లా రామయ్య తెలిపారు.

ఓటరు చైతన్యంపై రౌండ్ టేబుల్

విశాలాంధ్ర - బాపట్ల : ఊరు రా జన విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా రానున్న ఎన్నికలు నేపథ్యంలో జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం- ఎన్నికలు- ఓటరు చైతన్యం అంశంపై స్థానిక ఎన్జీవో హోమ్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం నానాటికి బలహీన పడుతున్న విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. ఎన్నికల్లో ధన ప్రభావం, కులం, మతం, మద్య, నేరస్థ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రొఫెసర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో వివిధ పార్టీలు లేదా అభ్యర్థులు ప్రజలకు డబ్బులు ఇవ్వటం ప్రజల్లో ఎక్కువ శాతం తీసుకోవడం అనేది నానాటికి తీవ్రస్థాయికి చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి లెక్చరర్ గోరంట్ల శాంతరావు, ఆట్ల బాలాజీ రెడ్డి, అభ్యుదయ భావాల వేదిక నాయకులు కోలా శరత్, హేతువాద సంఘం నాయకులు కరణం రవీంద్ర, డాక్టర్ పి సి సాయిబాబు, వై.భాస్కరరావు, జీవి బ్రహ్మం,గుదే రాజారావు, బక్క జయరామిరెడ్డి,నూర్ భాషా ఖాసిం, కె.కోటేశ్వరరావు, దాసరి లక్ష్మి, పి.ప్రసాద్, పి. కోటయ్య,ఎస్ కె సుభాని, జి.పూర్ణచంద్రరావు, గుంటూరు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర - రేపల్లె, బాపట్ల టౌన్ : చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న అసాం ఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటా మని రేపల్లె బాపట్ల డీఎస్పీలు డిఎస్పీ టి.మురళి కృష్ణ, వెంకటేశులు హెచ్చరిం చారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రేపల్లె అడవులదీవి,బాపట్ల స్టువార్టు పురం పోలీస్ స్టేషన్ల పరిదిలోని సోమ వారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పోలీస్ యంత్రాంగంతో నాటుసారా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు.గతంలో నాటు సారాయి తయారు చేసిన ప్రదేశాలతో పాటుగా అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న బట్టీలను ధ్వంసం చేసినట్లు తెలిపారు.నాటు సారాయి తయారు చేసిన,అక్రమ రవాణా చేసిన, విక్రయించిన చట్ట పరమైన కఠిన చర్యలు తీసు కుంటామన్నారు.నాటుసారా కలిగి ఉన్న వారిపై పిడి చట్టం ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరిం చారు. ప్రజలు తమ గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు సమాచారం ఇచ్చేందుకు డైల్ 100, 112 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో రూరల్ సీఐలు ఏ.శివశంకర్, వేణుగోపాల్‌రెడ్డి, టౌన్ సర్కిల్ సీఐ ఎమ్.నజీర్ బేగ్, నగరం సెబ్ సీఐ డి.శ్రీనివాసరావు, అడవులదీవి,చెరుకుపల్లి, నగరం, చోడాయపాలెం, వేమూరు, కర్లపాలెం, పిట్టలవానిపాలెం ఎస్సైలు ఎస్.వెంకటరవి, వై.సురేష్, డి.రామకృష్ణ, కె.శివప్రసాద్ రావు, జె.నాగరాజు,శివయ్య, రాజశేఖర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామదర్శిని జయప్రదం చేయాలి : జేసీ

విశాలాంధ్ర - బాపట్ల : గ్రామదర్శిని కార్యక్రమం జయప్రదం కొరకు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్. శ్రీధర్ చెప్పారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు 135 వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు.వీక్షణ సమావేశం ద్వారా తహశీల్దార్లు, ఎంపిడిఓలతో ఆయన నేరుగా మాట్లాడి తనపరిధిలోని వాటిని తక్షణమే పరిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు గ్రామదర్శిని కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి జిల్లా అధికారులు,ఎంపిడిఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం పోర్టల్లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు నాణ్యతతో సమస్యలకు పరిష్కారమార్గం చూపాలన్నారు.ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్ పంపిణీ కొరకు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.దోమల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పెండింగ్‌లో ఉన్న 723 ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రపరచాలన్నారు.ఆప్రాంతాల ఏఎన్ఎంలు ధృవీకరించేలా చూడాలన్నారు. వేమూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీలలో అంతర్గత రహదారులు, తదితరమైన 86 పనులు మంజూరు కాగా వాటిని తక్షణమే ప్రారంభించాలన్నారు.ఈ క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు పూర్తి అయ్యిందన్నారు.తహశీల్దార్లు పరిశీలించి ధ్రువీకరించాలని ఆయన సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబరు ఒకటో తేదీన ఘనంగా నిర్వహించాలని జిల్లా అధికారులంతా వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్.డి.ఓ జి.రవీంద్రబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.